మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న దొంతి

నెక్కొండ, జూన్ 30: పల్లెల్లో మౌలిక సదుపాయల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సాయిరెడ్డి పల్లెలో రూ. 4 లక్షలతో ఆదివారం ఆయన సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పల్లెల్లో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ బండారి వినయకుమారీ శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా విభాగం గ్రామ అధ్యక్షురాలు బైకాని రజితా రమేశ్, మాజీ సర్పంచ్ ఓరుగంటి రాములు, యూత్ అధ్యక్షుడు పెండి రవి ఎమ్మెల్యేను కోరగా.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ ఉపాధ్యక్షుడు లింగాల అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నర్సంపేట: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నర్సంపేటలోని మహాజన ఉద్యమ, ఎమ్మెస్సీ, డీబీడీపీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్లెపెల్లి ప్రణయదీప్‌మాదిగ మాట్లాడుతూ దొంతి ఇటీవల విదేశీ పర్యటనలో భాగంగా కెనడా దేశంలోని వ్యవసాయ విధివిధానాలపై అవగాహన పెంచుకున్నారని తెలిపారు. విదేశాలకు వెళ్లి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిశామని చెప్పారు. కార్యక్రమంలో గుంపుల మాలతీ లత, సరోజన, రేణుక, బోయిని నారాయణ, గుండేటి వీరేశం, కుమ్మరికుంట్ల శ్రీకాంత్, దామెర సుధాకర్, బొంత భిక్షం, కందిక యాకయ్య, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శివ(ఫైల్)

ఖానాపురం, జూన్ 30: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మానె పల్లి శివ(35) ప్రైవేట్ గోదాంలో గుమస్తాగా పని చేస్తూ ఓ దినపత్రికలో కంట్రిబ్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శివ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇటీవల ఉద్యోగం కోసం రూ. 4 లక్షల అప్పు చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన అతడు ఈ నెల 28న పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం విషయాన్ని ఫోన్‌లో కుటుంబ సభ్యులు చెప్పాడు. వారు ఘటనా స్థలానికి వెళ్లి అతడిని నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య లత, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావుతోపాటు జర్నలిస్టులు పరామర్శించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

రాయపర్తి, జూన్ 30: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన కొండూరు గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మారబోయిన మారయ్య తన పశువులను మేత కోసం ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లోకి తీసుకెళ్లాడు. మేస్తున్న క్రమంలో ఆవు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్తంభాలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 50 వేల ఆర్థిక నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపాడు.

4న కలప వేలం

కరీమాబాద్, జూన్ 30: మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న కలపను ఈ నెల 4న వేలం వేయనున్నట్లు పీటీసీ సిబ్బంది తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 2లోగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌ను 8099159122 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలి

- ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి
- నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలి
- వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్
- పలు స్టేషన్ల సందర్శన

వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ

వర్ధన్నపేట, జూన్ 30: పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే వారికి న్యాయం జరిగేలా చూడాలని వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ సిబ్బందికి సూచించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చిన మహిళలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారికి సహకరిస్తూ వారి సమస్యలను పూర్తిగా విని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. అప్పుడే పోలీసులకు ప్రజల్లో గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం స్థానిక ఏసీపీ నర్సయ్య, ఎస్సై ప్రవీణ్‌తో కలిసి వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌ను పరిశీలించారు. సెంటర్‌లో వాహనాలు వేగంగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు నిత్యం రహదారిపై పోలీసు వాహనాలు పెట్రోలింగ్‌లో ఉండేలా చూడాలన్నారు. పట్టణం, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

స్నేహపూర్వక సంబంధాలతో సత్వర పరిష్కారం

రాయపర్తి: విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ప్రజలందరితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం ద్వారా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, కేసుల సత్వర పరిష్కారానికి మార్గాలు లభిస్తాయని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. ఆదివారం రాత్రి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ జీడీ సూర్యప్రకాశ్‌తో కలిసి సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విధి నిర్వహణలో పోలీసులు ప్రజలతో స్నేహపూర్వక, సోదరభావంతో మెలగాలన్నారు. మండలంలో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యక్తులపై కఠినంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వడ్డే సందీప్‌కుమార్, ఏఎస్సై పళ్లకొండ సదానందం, సిబ్బంది బండారి మహేందర్, తూళ్ల సంపత్‌కుమార్, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న రైతులు

ఆయిల్‌పాం తోటల సందర్శన

ఖానాపురం, జూన్ 30: మండలంలో ఆయిల్‌పాం సాగు చేసిన పలువురు రైతులు ఆదివారం ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలో ఆయిల్‌పాం తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా పంటల సాగు వివరాలను తెలుసుకునేందుకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస రావు, నర్సంపేట డివిజన్ ఉద్యాన అధికారి జ్యోతి ఆధ్వర్యంలో 15 మంది రైతులు ఆశ్వరావుపేట సమీపంలోని ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. అక్కడి రైతుల అనుభవాలు, పంటల సాగులో మెళకువలను తెలుసుకున్నారు. రైతులు వెంకటనారాయణ, వాసుదేవ రెడ్డి, గండ్రాతి శ్రీనివాస్, పరుచూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

చెన్నారావుపేట, జూన్ 30: ఇద్దరు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని నారాయణతండా పరిధి జోజిపేటలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ సుధాకర్, శైలజ(25) దంపతులకు పిల్లలు వర్షిత, అభిషేక్ ఉన్నారు. శైలజ తన భర్తతో గొడవపడి గత నెల 29న ఉదయం ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధుమిత్రుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శైలజ తండ్రి గుగులోత్ రంజ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్

సాగు చేసే వారికి రైతుభరోసా ఇవ్వాలి

- సమయానికి రైతులకు పెట్టుబడి సాయం అందించని రాష్ట్ర ప్రభుత్వం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్

గీసుగొండ, జూన్ 30: పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ రైతుభరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించాలని డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్ కోరారు. వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల, గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి రైతు సహకార సంఘం కార్యాలయ ఆవరణలో ఆదివారం వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం లాభసాటిగా లేకున్నా సాగు చేస్తున్న రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలని కోరారు. మొగిలిచెర్ల రైతు వేదికలో జరిగిన సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగు చేస్తున్న ప్రతి రైతుకు రైతుబంధు ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ రైతుభరోసా పథకం కింద రూ. 15 వేలు, కౌలు రైతుకు రూ. 12 వేలు ఇవ్వాలని కోరారు. సమయానికి పెట్టుబడి సాయం ఇవ్వడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు జేడీఏ ఉషాదయాళ్ తెలిపారు. రైతులు వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దీర్ఘకాలిక వరి సాగు చేసుకునే సమయం ముగిసిందన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు హరిప్రసాద్‌బాబు, సారంగం, జాతీయ ఆహార భద్రత మిషన్ టెక్నికల్ అధికారి శ్రీధర్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఏఈవోలు విజయ్, హుస్సేన్, ఎలుకుర్తి సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ కార్యవర్గం

చెన్నారావుపేట, జూన్ 30: మండలకేంద్రంలోని కాలనీకి చెందిన ఫ్రెండ్స్ యూత్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు బారపాక నవీన్, గౌరవ అధ్యక్షుడు బర్ల దేవదాస్ తెలిపారు. అధ్యక్షుడిగా మాదాసి ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మకంటి సాగర్, కార్యదర్శులుగా జంగిలి భరత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జంగిలి సమ్మయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు సాదు నర్సింగరావు పాల్గొన్నారు.

రజినీకుమార్‌ను అభినందిస్తున్న సీఐ కృష్ణ

హెడ్‌కానిస్టేబుల్‌కు కాంస్యం

ఖిలావరంగల్, జూన్ 30: రైఫిల్ షూటింగ్‌లో వరంగల్ ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పీ రజినీకుమార్ కాంస్య పతకం సాధించాడు. బీహార్ రాష్ట్రం దానాపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే షూటింగ్ పోటీల్లో రైఫిల్ విభాగంలో కాంస్యం, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎయిర్‌పిస్తోల్, ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కూడా రజినీకుమార్ కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు అతడిని వరంగల్ ఆర్పీఎఫ్ స్టేషన్‌లో సీఐ కృష్ణ, ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై ఎంవీ రావు, సిబ్బంది అభినందించారు.

సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

వృద్ధుల సంక్షేమ కమిటీ ఎన్నిక

చెన్నారావుపేట, జూన్ 30: వృద్ధుల సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ తెలిపారు. మండలకేంద్రంలోని జాగృతి విద్యానికేతన్‌లో ఆదివారం వయో వృద్ధులు సమావేశమై ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గౌరవాధ్యక్షుడిగా వరంగంటి మల్లయ్య, అధ్యక్షుడిగా ఈగ సత్యనారయణ, ప్రధాన కార్యదర్శిగా ములుక సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా కాసుల నర్సింహచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు అడుపసత్తయ్య, కొమ్మాలు, కుమారస్వామి, ముత్యం సాంబయ్య, కృష్ణయ్య, సమ్మిరెడ్డి, వీరయ్య, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పత్తి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో చోరీ

దుండగుల చేతిలో ధ్వంసమైన పాన్‌షాప్ డోర్

చెన్నారావుపేట, జూన్ 30: పాన్‌షాప్‌లో చోరీ జరిగిన ఘటన జల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఎలకంటి కృష్ణ పాన్‌షాప్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి షాప్‌నకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు డోర్‌ను ధ్వంసం చేసి చొరబడి షాప్‌లోని సుమారు రూ. 7 వేల విలువైన కూల్‌డ్రింక్స్ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండాలను తీసుకెళ్లారు. యజమాని కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

కాశీబుగ్గ, జూన్ 30: తోళ్ల పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ట్యానరీ అండ్ లేదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యాకేందర్ డిమాండ్ చేశారు. దేశాయిపేటలోని ఎస్ఆర్‌భవన్‌లో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. తోళ్ల పరిశ్రమల యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సిద్దిక్ అహ్మద్, జన్ను స్వామి, తాళ్ల అశోక్, ప్రసాద్, యోహోషువా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యాకేందర్

ఖాతాదారులకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు

- ఏడాదిలో రూ. 327.88 కోట్ల టర్నోవర్
- బ్యాంకు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశీబుగ్గ, జూన్ 30: ఖాతాదారులకు వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లో ఆధునిక బ్యాంక్ సేవలు అందిస్తున్నట్లు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. దేశాయిపేటరోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం బ్యాంక్ 28వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. వాటాదారుల సమష్టి కృషితో 27 ఏళ్లు పూర్తి చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంక్ పటిష్టంగా ఉందన్నారు. వరంగల్‌లో నూతనంగా ఆధునిక వసతులతో బ్యాంక్, ఏటీఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి ఆరు ఏటీఎం సెంటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంక్ రూ. 191.72 కోట్ల డిపాజిట్లు సేకరించి, రూ. 136.16 కోట్ల రుణాలు మంజూరు చేసి, తమ బ్యాంకు రూ. 327.88 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. ఇతర బ్యాంకుల కంటే అధిక వడ్డీ అందిస్తూ వివిధ వర్గాల వారికి అధిక ఆదాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వాటాదారుల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 50 వేల ఆర్థిక సాయం, కిడ్నీ మార్పిడికి రూ. 20,116, పన్నెండేళ్లలోపు పిల్లలు గుండె జబ్బులతో బాధపడితే రూ. 20,116 సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అనాథ పిల్లల విద్యాభ్యాసం కోసం బ్యాంక్ ద్వారా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అంగవైకల్యం కలిగిన వారికి ట్రైసైకిళ్లు, ఆర్థిక సాయం, విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తోట జగన్నాథం, డైరెక్టర్లు వేణుగోపాల్, కూరపాటి చంద్రమౌళి, తోట సంపత్, మహ్మద్ గౌసోద్దీన్, డాక్టర్ పవన్‌కుమార్, బొమ్మనేని పాపిరెడ్డి, పొన్నా హరినాథ్, పోలెపాక రవికుమార్, బండారి భార్గవి, మంద స్వప్న పాల్గొన్నారు.

'లైంగికదాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నిరసన తెలుపుతున్న మహిళలు

కాశీబుగ్గ, జూన్ 30: హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు రాయల డిమాండ్ చేశారు. ఈ మేరకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఆదివారం నిరసన తెలిపారు. పాపకు సరైన వైద్యం అందించి, డ్రగ్స్‌కు బానిసై చిన్నాపెద్ద తేడా లేకుండా దారుణాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్వప్న, లక్ష్మి, అనూష, సరస్వతి, భార్గవి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

అకారణంగా ముగ్గురు యువకుల దాడి

గీసుగొండ, జూన్ 30: మచ్చాపురంలో తాగిన మైకంలో ముగ్గురు యువకులు ఓ వ్యక్తిపై దాడి చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బిల్ల భిక్షపతి ఆదివారం సాయంత్రం మచ్చాపురం స్టేజీ వద్ద ఉన్న హోటల్ ఎదుట అదే గ్రామానికి చెందిన మర్రి కుమారస్వామి, బిల్ల రాజేందర్, బిల్ల కుమారస్వామితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలలో బైక్‌పై వచ్చిన కోలా సునీల్, సంగినేని విక్రమ్, హజ్జు అకారణంగా భిక్షపతిపై కర్రలతో దాడి చేశారు. వెంటనే స్థానికులు 100కు డయల్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని భిక్షపతిని దవాఖానకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కరీమాబాద్, జూన్ 30: సుమారు 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులంతా ఒకచోటు చేరారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకొని ఆడిపాడి సరదాగా గడిపారు. ఉర్సులోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కరీమాబాద్ దసరారోడ్‌లోని మున్నూరుకాపు పరపతి సంఘం భవనంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

ఎన్టీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులు

ఎన్టీఆర్‌నగర్‌లో జేసీబీతో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న అధికారులు

నర్సంపేట, జూన్ 30: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో మున్సిపల్ అధికారులు డ్రైనేజీ పనులు చేపట్టారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మురుగునీరు, వర్షపునీరు ముందుకెళ్లడం లేదు. నీరంతా ఇళ్ల మధ్యకు చేరుతున్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఈ విషయాన్ని స్థానికులు 12వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ పాషా దృష్టికి తీసుకెళ్లడంతో మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. కమిషనర్ ఆదేశాలతో జేసీబీ సహాయంతో కౌన్సిలర్ పాషా పనులను దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వార్డు ఆఫీసర్ కాట శ్రీనివాస్, ఎన్టీఆర్ నగర్‌వాసులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల సీజ్

పర్వతగిరి, జూన్ 30: మండలంలోని ఏనుగల్లులో కేకే కిరాణా షాపులో కానుగంటి తిరుపతి నిషేధిత పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నాడనే సమాచారంతో ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 8,925 విలువైన అనార్ టొబాకో ప్యాకెట్లు, ఆర్‌ఆర్ టొబాకో ప్యాకెట్లు కలిపి మొత్తం 595 పొచెస్‌లను సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రజా పాలనలో అరెస్టులు న్యాయమా?

హనుమకొండ, జూన్ 30: ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం న్యాయమా అని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ప్రశ్నించారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను మూడు వేలకు ఉద్యోగాలు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్వరాష్ట్ర సాధనకు ఏవిధంగా పోరాటం చేశామో అదే తరహాలో నిరుద్యోగ యువత తరపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నా అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి క్యాబినెట్‌లోనే 25 వేలతో మెగా డీఎస్సీ నిర్ణయం తీసుకొని నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు.

చెరువు శిఖం భూములు హాంఫట్

హద్దులు తొలగించి.. పంటభూమిగా మార్చి..

ఇబ్బందులు పడుతున్న ఆయకట్టు రైతులు

రక్షణ చర్యలు చేపట్టాలని వేడుకోలు

నల్లబెల్లి, జూన్ 30: మండలంలోని చెరువు శిఖం భూములను కొందరు దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా మండలంలోని నారక్కపేట శివారులో ఉన్న లచ్చిరెడ్డికుంటను కూడా అభివృద్ధి చేసింది. చెరువు శిఖం ఆక్రమణకు గురికాకుండా స్టైంచ్ కటింగ్ చేసి హద్దులు ఏర్పాటు చేసింది. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో 20.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లచ్చిరెడ్డికుంటలో కొంతమంది రైతులు స్టైంచ్‌ను తొలగించి సుమారు పదెకరాల శిఖం భూమిని ఆక్రమించుకుని వ్యవసాయ భూమిగా మార్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే, మరి కొంత మంది రైతులు ఏకంగా మత్తడిని ధ్వంసం చేయడంతోపాటు చెరువులోకి వర్షపు నీరు చేరే ప్రధాన కాల్వను పూడ్చివేసి పంట పొలంగా మార్చారు. దీంతో చెరువులోకి సరిగా నీరు చేరక వానకాలంలో వరి సాగు చేస్తే పం